## కాలమ్ దాటని కథ

నిద్ర లేచి కాఫీ తాగుతూ వరండాలో కొచ్చేసరికి మా వీథిలో జనం పోతున్నారు. వారి చేతుల్లో పాల గ్లాసులు, పూలు వున్నాయ్.

"ఏమిటి విశేషం?" అనిపోతున్నవాళ్ళలో ఒకాయన్ను అడిగాను.

"మీ వీథిలో దేముడు వస్తే మీకు తెలియక పోవడమేమిటండీ- అప్పారావింటికి, సుబ్బారావింటికి మధ్యన గోడ లేదు. యిటుకలు పేర్చారు. దానిమీదకు పెద్ద పాము వచ్చింది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వచ్చారని వూరంతా చెపుతుంటే" అన్నాడు.

వెళ్లి చూశాను. పాము మత్తుగా పడుకు నుంది. కింద తెల్లని కొత్తగుడ్డ పరిచారు. ఒక ప్లేటు పెట్టారు. అందులో పాలు పోశారు. అగరొత్తులు వెలిగిస్తున్నారు. "నేనే సుబ్రహ్మణ్యేశ్వరుణ్ణి" అంటూ ఒక ముసలమ్మ పూనకం వచ్చి చెబుతోంది. ఆమెకు కొబ్బరి నీళ్ళు పోశారు. హాయిగా తాగింది. యీ వార్త ఎలా, ఎప్పుడు పాకిందో జనప్రవాహం ఎక్కువైంది.

యింతలో రాచకీయం అనే మరో పాము అక్కడికి పాకుతూ వచ్చింది. స్త్రీ రూపంలో వచ్చింది. ఆమె మా పేటలో నాయకురాలు.

## ఇదీ వరస

"స్వామి (పాము) కి గుడి కట్టిద్దాం. హుండీ పెట్టండి అని" అని బిందె, పసుపు గుడ్డ తెమ్మంది. హుండీలో డబ్బులేస్తున్నారు.

సాయంత్రం నాలుగ్గంటలకు పాము జన ఘోష వినలేక నిద్ర లేచి కదిలి పక్కింటికి పాకింది. ఆ యింటివాళ్ళుభయపడుతున్నారు, భక్తులు తమయింట్లో వున్న వస్తువులమీద కన్నేస్తారేమోనని.

"స్నేక్ పార్కుకు ఫోన్ చెయ్యండి, వాళ్ళు తీసి కెళ్తారు జాగ్రత్తగా" అన్నాడో పెద్ద మనిషి.

"ఏమక్కర్లేదు. దానంతట అదే పోతుంది" అని ఒకాయన దబాయించాడు.

పాము కదిలి మూడో యింటికి వచ్చి పడగ విప్పి బుస కొట్టింది.

ఆ యింట్లో కుర్రకారు కర్రలతో బాది చంపారు. జనం కొందరు కన్నీరు కార్చారు.

అంత్యక్రియలు బాగా చెయ్యమన్నారు. కొత్తగుడ్డలో కట్టి కొబ్బరి ఆకులతో పూరి చివర దహనం చేశారు జనం.

"ఎలాగైనా పాము క్రూర జంతువు. చూస్తూ వూరుకోరాదు" అని అదే జనం, అవే కంఠాలు వాగాయి తిరిగిపోతూ.

—చెరువు ఆంజనేయ శాస్త్రి

## పందెం

- పి.వి. కెనడి

"నేను టికెట్ కొనకుండా, టికెట్‌తో బస్‌లో ప్రయాణం చేస్తా" అన్నాడు సాహిర్. "టికెట్ కొనకుండా టికెట్టెలా వస్తుంది? మేమెవ్వరం నీకు టికెట్ కొనం... అప్పుడు?" అన్నాడో స్నేహితుడు.

"నాకు మీరు కొననవసరం లేదు! చివరికి మీరు కూడా మీకు కొనుక్కోనవసరంలా, నేనూ కొనను. కానీ మీ టిక్కెట్లు మీకిస్తా" ముఖం వెలిగిపోతుండగా అన్నాడతడు. "ఇంపాజిబుల్!" అరిచాడో వైట్ షర్ట్ కుర్రాడు. "నీకు గాక మాకు కూడా ఐదొందల రూపాయిలు జరిమానా వేపిద్దామనుకుంటున్నావా?". "మీకు టికెట్లిస్తానని అన్నాను కదా! మీకెందుకు భయం?"

ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు వాళ్ళు.

"బెట్ కడతారా?" అన్నాడు సాహిర్ ఉత్సాహంగా. "నువ్వువచ్చినా గెలవలేవోయ్" అని అందరి వైపు చూశాడు వైట్ షర్ట్ కుర్రాడు.

అందరూ పది-పది బెట్ కట్టడానికి ఒప్పుకున్నారు. "మొత్తం నలుగురు అంటే - 40 రూపాయిలు. నా ఒక్కడిదే - 40 రూపాయిలు" అన్నాడు సాహిర్. అతడు ఫుల్ వైట్ షర్ట్, పేంట్, బ్లేక్ బెల్ట్‌తో 'ఇన్‌షర్ట్' లో వున్నాడు.

దూరంగా బస్ వస్తూ కనిపించింది, మామూలుగానే - ఫుల్ రష్‌తో కండక్టర్ చివరి వైపుండడం చూసి ముందువైపెక్కాడు సాహిర్. మిగతా వాళ్ళతనిని అనుసరించారు. బస్ ఎంత రష్‌గా వుందంటే కండక్టర్ వీళ్ళ దగ్గర కొచ్చేటప్పటికి పది నిముషాలు పట్టొచ్చు.

సాహిర్ తన సైట్ కళ్ళజోడు సరిచేసుకొని, తన ముందు పాసెంజర్‌ని "టికెట్" అని అడిగాడు. ఆ పాసెంజర్ వెనక్కి తిరిగి చూసేసరికి సాహిర్ కనిపించాడు. "నేను చెకింగ్ మాస్టర్ని -- మీ టికెట్టివ్వండి" అన్నాడు. అతని ఆకారం - డ్రస్ ఆ విధంగానే వుంది కనుక ఆ పాసెంజర్ వెంటనే టికెట్ తీసి సాహిర్‌కిచ్చాడు.

అలాగే, మరి కొందరి దగ్గర టికెట్లు తీసుకొని, "నెక్స్ట్ స్టాప్‌లో కండక్టరు దగ్గరున్న నంబర్లతో పోల్చి చెక్ చేస్తా" అని అక్కడి వాళ్ళకు చెప్పాడు సాహిర్. నెక్స్ట్ స్టాప్‌లో దిగి, ఫ్రెండ్స్‌కి టికెట్స్ ఇచ్చేసి, తన దగ్గరొకటుంచుకొని ఈసారి వెనుక వైపెక్కాడు సాహిర్. అతడి తెలివి తేటలకాశ్చర్య పడుతూ మిగతా ఫ్రెండ్స్ కూడా కాస్త ఏడుపు ముఖాలతో ఎక్కారు.

అదే స్టాపులో ఓ చెకింగ్ మాస్టార్ ఎక్కాడు. ఫ్రెండ్స్, సాహిర్ తమ టికెట్లను హాయిగా ఇచ్చారతడికి. అతడు తన దగ్గర నంబర్లతో సరిపోల్చుకొని ఫ్రెండ్స్ టికెట్స్ వాళ్ళ కిచ్చేసాడు. సాహిర్ టికెట్ మాత్రం నంబర్లతో పోల్చి, పిడుగుపాట్లా అన్నాడు— "ఇది మీ టికెట్టేనా?" అని.

"అవును" కాస్త ఆశ్చర్యంతో జవాబిచ్చేడు సాహిర్.



"మీ పేరు?" అడిగాడు చెకింగ్ మాస్టర్.

కంపించే స్వరంతో అన్నాడు — "సాహిర్" అని.

అతడు రాసుకున్నాడు. తరువాత తలెత్తి, "ఐదు వందలు కట్టండి" అన్నాడు. చుట్టుపక్కలవాళ్ళంతా జరుగుతున్నది చూస్తున్నారు ఆశ్చర్యంతో.

"ఎందుకు?" ఈసారి భయంతో అడిగేడు సాహిర్.

"ఎప్పటి టికెట్టో చూపిస్తూ ఈ రోజు టికెట్ కొనకుండా వుందామనుకున్నారు కాబట్టి" కాస్త కోపంగా జవాబిచ్చాడు చెకింగ్ మాస్టర్.

అంతే! సాహిర్ కళ్ళు తిరిగిపోయాయ్. బస్ తల్లక్రిందులైనట్లనిపించింది.